
కథ

# స్వప్న సుందరి

కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి

ప్రభాకరం తన తల్లితండ్రులతో కల్సి పెళ్లి చూపులకు శంకరం గారింటికి వెళ్లాడు. పెళ్లి కూతురు సుధారాణి. అందాలబొమ్మ. ఆమెను చూడగానే సుధారాణి అనే కంటే అందాలరాణి అంటే ఆమెకు తగినట్లుగా వుంటుందని అనుకున్నాడు. ప్రభాకరంలో ఈస్థటిక్ సెన్స్ అంటే అందానికి స్పందించే లక్షణం ఎక్కువ పాలులో వుంది. పచ్చని బంగారు ఛాయతో మెరిసిపోతున్న ఆమె, తన పొడవైన జడను ముద్దాడటానికి పెద్ద బంతుల వంటి ఆమె పిరుదులు పోటీ పడుతూ వుండగా, హంస నడకతో ఒయ్యారాన్ని ఒలకపోస్తూ అందరికీ కాఫీ కప్పులను ట్రేలో తీసుకు వచ్చింది. ప్రభాకరానికి కప్పు అందిస్తూ వుండగా ఆమె పైటజారి పై ఎదను బయట పెట్టింది. ఆమె ఎద సంపద అతని దృష్టిని ఆకట్టుకుంది.. అక్కడ వున్న పెద్దలంతా కాఫీలు తాగుతూ కబుర్ల ధ్యాసలో వున్నారు. ప్రభాకరం వెంటనే కాఫీ కప్పు అందుకోకుండా తన ఎదను చూస్తుండటాన్ని గమనించి ఆమె సిగ్గుపడి నెమ్మదిగా 'కాఫీ తీసుకోండి' అని అతని దృష్టిని మరల్చి పైటను సరిచేసుకుంది. ఆమె తియ్యని కంఠం నుంచి వచ్చిన ఆ రెండు మాటలు అతనిని ఈ లోకంలోకి తీసుకువచ్చాయి.

వెంటనే అతను కాఫీ కప్పు అందుకున్నాడు. కాని అతని మనసంతా ఆమె అందాల చుట్టూ భూమి సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తున్నట్లుగా తిరుగుతోంది. అతను తన తండ్రి గోపాలం చెవిలో అమ్మాయితో పర్సనల్‌గా మాట్లాడాలని వుందని చెప్పాడు. గోపాలం శంకరానికి ఈ విషయం చెప్పిన వెంటనే ఆయన ఓ.కే. అన్నాడు. ప్రభాకరం, సుధారాణి డాబా పైకి వెళ్లారు.



''నేను మీకు నచ్చానా?'' అడిగాడు ప్రభాకరం. ఆమె అవునన్నట్లుగా తల వూపింది.

''మరి... నేను మీకు నచ్చానా?'' అని అతని కళ్ల ల్లోకి చూస్తూ ఆమె అడిగింది.

''అన్ని అందాలను స్వంతం చేసుకున్న మీరు నచ్చలేదు అనేవాడికి అందమంటే అర్థం ఆవ గింజలో అరవై వంతు కూడా తెలియదని ఖచ్చితంగా అంటాను. మీరు నాకు నూటికి నూరు పాళ్లు నచ్చారు. మీ అందాలు మొట్టమెదట మిమ్మల్ని చూసినప్పుడే నన్ను పరవశుడిగా చేశాయి. అందుకనే మీ చేతినుండి కాఫీ కప్పును వెంటనే అందుకోలేక పోయాను'' జరిగిన చిలిపి సంఘటన గుర్తుకు వచ్చి ఆమె ముఖం సిగ్గుతో పసుపురంగు నుంచి ఎరుపులోకి మారింది. కొంచెంసేపూ ఆమె అతని కళ్లలోకి సూటిగా చూడలేకపోయింది. తరువాత తన సిగ్గు తెరను తొలగించి ఆమె ''నా అందం మీకు అంతగా నచ్చిందా?'' అని అడిగింది.

''ఎంతగా నచ్చిందో నేను మాటల్లో చెప్పలేను. సమయం వచ్చినప్పుడు మీ అందాలన్నీ దోచుకున్నప్పుడు మీ అందం నాకెంతగా నచ్చిందో మీకు తెలుస్తుంది''.

''నా అందాన్ని మీరు కొరుక్కుతింటారని నాకు భయంగా వుంది'' అంది ఆమె గలగలా నవ్వుతూ.

అప్పుడామె చక్కని పలు వరుసలని గమనించాడు.

''మీ మాటలు కోయిల పాటలాగా మధురంగా వున్నాయి. మీ నవ్వు వెన్నెల కురిపిస్తోంది''.

''మీరు కవులా? సౌందర్యోపాసకులా?'' ఆమె అడిగింది అతని పొగడ్తలకు మురిసిపోతూ.

''సౌందర్యోపాసకుడిని మాత్రమే'' అన్నాడతను. కొంచెంసేపు వారిద్దరి మధ్య నిశ్శబ్దం. అప్పుడామె ''మన కోసం అందరూ ఎదురు చూస్తూ వుంటారు. క్రిందికి వెళదాం'' అంది. ఇద్దరూ చిరునవ్వులు చిందిస్తూ తిరిగిరావడం చూసి శంకరం ''బావగారూ, చూశారుగా, అబ్బాయి, అమ్మాయి ఒకరి కొకరు నచ్చినట్లేనని వాళ్ల ముఖాలే చెబుతున్నాయి. ఇంక మనం పెళ్లిముహూర్తం పెట్టు కుందామా?'' అన్నాడు.

''శుభస్యశీఘ్రం. మాకు కట్నకానుకల పట్టింపులు ఏమీ లేవు. ఇప్పటివరకు మా వాడికి చూసిన సంబంధాలలో ఏ అమ్మాయి నచ్చలేదు. ఈ నాటికి మీ అమ్మాయి నచ్చింది. మాకు చాలా సంతోషంగా వుంది'' అన్నాడు గోపాలం.

''అదేం మాట బావగారూ. మీరు ఏమీ వద్దన్నా మా తృప్తికోసం మా అమ్మాయికి మేము ఇవ్వాలనుకున్నవన్నీ ఇచ్చి సంతోషంగా మీ కోడలిని చేస్తాం''.

''సరే మీ ఇష్టప్రకారమే కానివ్వండి''.


ఎక్కువ వ్యవధి లేకుండా ప్రభాకరం, సుధారాణిల పెళ్లి ఘనంగా జరిగింది.

శోభనం రాత్రి గదిలోకి అడుగు పెట్టింది 'అందాలరాణి'. ఆమె అందాలన్నీ ఎప్పుడు స్వంతం చేసుకుందామా అని నిమిషమొక యుగంగా ఎదురుచూస్తున్న ప్రభాకరం వెంటనే వెళ్లి తలుపు గడియ పెట్టివచ్చి, ఆమె చేతిలోని పాల గ్లాసును టీపాయ్ మీద వుంచి ఆమెను తన కౌగిట్లో గాఢంగా బంధించాడు. ఆమె పెదవులకు అతని పెదవులు దగ్గరవుతున్నాయి. ఆమె సిగ్గుతో పాల గ్లాసు అతనికి అందిస్తూ ''ముందు ఈ పాలు తాగండి'' అంది.

''నీ గులాబీ పెదవుల మీద తియ్యని ముద్దు కంటె ఈ పాలు నాకు ఎక్కువ కాదు'' అని ఆమె పెదవుల మీద, చెంపల మీద, కంఠం మీద, నుదుటి మీద ఆమెకు ఊపిరి సలపనీయకుండా ముద్దుల వర్షం కురిపించాడు. ఆమె మధురానుభూతిని పొందుతూ పరవశించింది.

''మరి ఇప్పుడైనా పాలు తాగుతారా?'' అని అడిగింది.

అతను సగం పాలు తాగి సగం ఆమెకిచ్చాడు. మళ్లీ అతనామెను తన బిగి కౌగిట్లో బంధించి ''సుధా, నా కోరిక ఒకటి తీరుస్తావా? పెళ్లి చూపుల్లో నిన్ను చూసినప్పటి నుంచి అది నన్ను దహించి వేస్తోంది'' అని ఆమె కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.



''మీ కోరికను తీర్చి మిమ్మల్ని తృప్తి పరచడమే నా కోరిక కూడా. అదేమిటో చెప్పండి''

''నీ సహజమైన అందాలన్నీ ఒకేసారి చూడాలని వుంది'' వెంటనే ఆమె తన అందాలని ఆరపోయ డానికి సిద్ధమైంది. అతను కామోద్రేకానికి లోనయ్యాడు. ఆమె అందాలతో కనువిందు చేసింది.

ఇంతలో ''ఒరేయ్, ప్రభా ఇంకా నిద్రలోనే వున్నావా? మధ్యాహ్నం అనగా అన్నం తిని పడుకున్న వాడివి ఇప్పుడు సాయంకాలం నాలుగు గంటలైనా లేవలేదు. మనం కేశవరావు గారింటికి పెళ్లి చూపులకు వెళ్లాలి. వెంటనే లేచి మొహం కడుక్కుని రెడీ అవ్వు. కాఫీ తాగుదు గాని'' అని తల్లి

శాంతమ్మ మాటలు అతనికి వినపడ్డాయి. స్వర్గ సౌఖ్యాలనందించే మధుర స్వప్నం చెదిరిపోయి అతను షాక్ తిన్నట్లు ఫీలయ్యాడు. ఆ క్షణంలో పంచభక్ష్య పరమాన్నాలతో వున్న నిండు విస్తరిని ఎవరో లాగివేసినట్లు, ఫస్ట్‌ప్రైజ్ వచ్చిందనుకున్న లాటరీ టిక్కెట్టుకు అది రాంగ్ నంబరని తరువాత ప్రకటనలో తెల్సినట్లుగా వెంటనే మనసులో బాధ పడ్డాడు. కొంత సేపటికి స్థిమిత పడి ''అయితే ఇదంతా పగటి కలేనా? ఈ కల నిజమైతే ఎంత బాగుండును'' అనుకుని పెళ్లి చూపులకు సిద్ధమయ్యాడు.

తల్లితండ్రులతో ప్రభాకరం కేశవరావుగారింటికి పెళ్లిచూపులకు వెళ్లాడు. పెళ్లికూతురు వాణి. ఆమెను చూడగానే ప్రభాకరం తన కళ్లను తానే నమ్మలేక పోయాడు. కళ్లు నలుముకుని మళ్లీ మళ్లీ పరీక్షగా చూశాడు. తన్ను తాను గిల్లుకుని కల కాదు అని నిర్ధారణ చేసుకున్నాడు. ఆశ్చర్యం! ఈ వాణి తనకు మధ్యాహ్నం కలలో కనపడిన సుధారాణియే! ఇలలో తను పెళ్లి చూపుల్లో చూడబోయే వాణిని కలలో సుధారాణిగా ఎలా చూడగలిగాడు? ఎలాగయితేనేం. తను కోరినట్లుగా తన కల నిజం కాబోతున్నది. తన కోరికలన్నీ నెరవేరతాయి. ఈ ఆలోచనలతో అతను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. కలలో తన తండ్రికి చెప్పినట్లుగానే వాణితో తను ఒంటరిగా మాట్లాడాలని చెప్పాడు. గోపాలం ఈ విషయాన్ని కేశవరావుకి చెప్పగానే ఆయన ప్రభాకరం, వాణిలను మేడ మీదికి పంపించాడు.

''మీకు ముందు చాలా ఆశ్చర్యం కలిగించే ఒక ముఖ్యవిషయం చెప్పాలి'' అన్నాడు ప్రభాకరం. ఒకరికొకరు నచ్చడం, నచ్చకపోవడం గురించి కాకుండా సంభాషణ ఈ విధంగా అతను ప్రారంభించడం ఆమెకు వింతగా అనిపించింది ''అదేమిటో చెప్పండి'' అంది చాలా కుతూహలంగా.

''మిమ్మల్ని ఈ మధ్యాహ్నం నా కలలో చూశాను. అప్పుడు కూడా అవి పెళ్లి చూపులట. మీ పేరు సుధారాణిట. ఆమె తండ్రి శంకరంట'' అన్నాడు ఉత్సాహంగా.

''అంటే నా రూపులోనే సుధారాణి మీకు కనపడిందన్న మాట''.

''ఉన్నమాటే. ముమ్మూటికీ మీ రూపులో, మీ కవల సోదరి అన్నట్లుగా వుంది'' అని కలలో కనపడిన రాణిని ఆపాదమస్తకం ఒక కవిలాగా వర్ణించాడు. ఆ అందాల వర్ణన తనకే పూర్తిగా వర్తించడం వలన, వాణి సిగ్గుతో ముడుచుకు పోయింది. పెళ్లి చూపుల నుంచి, శోభనం రాత్రి మధ్యలో తన కల చెదిరిపోయేటంత వరకు ఆమెకు వివరంగా చెప్పాడు. అతని కలలోని అను భవాలన్నీ దాచకుండా చెప్పినందుకు వాణి అతనిని అభినందించింది. ''మీ నిజాయితీ నాకు నచ్చింది'' అంది.

ప్రభాకరం, వాణిల పెళ్లి వైభవంగా జరిగింది. శోభనం రాత్రి వాణి పాల గ్లాసుతో గదిలోకి రాగానే ఆమెతో అతను ''ఇది కలేమోనని అనుమానం వుంది. నన్ను ఒకసారి గిల్లు'' అన్నాడు. ఆమె నవ్వుతూ పాల గ్లాసు అతని చేతి కందించి అతని బుగ్గమీద సున్నితంగా గిల్లి, ''ఇది కల కాదని నమ్మకం కదిరిందా?'' అంది.

''నువ్వు నా స్వప్నసుందరివి. కలలో మాయమై ఇలలో ప్రత్యక్షమయ్యావు. రాణి, వాణి ఇద్దరూ నువ్వే'' అని ఆమెను గాఢాలింగనం చేసుకున్నాడు.

''మీ వంటి నిజాయితీపరులు, సౌందర్యోపాసకులు భర్తగా లభించడం నా అదృష్టం'' అని తన పూల తీగల్లాంటి హస్తాలతో అతనిని చుట్టివేసి తన్మయత్వం పొందింది.

''అంతాబాగానే వుంది. కాని మీరు ముందుగా నన్ను కలలో పెళ్లి చూపుల్లో సుధారాణిగా చూడడం చాలా ఆశ్చర్యంగా వుంది'' అంది.

''ఒక్కొక్కసారి ప్రపంచంలో మనం వూహించని అద్భుతాలు జరుగుతుంటాయి. మనిషి జీవితంలోనూ ఊహించని మలుపులుంటాయి. నాకు నువ్వు కలలో కనిపించడం అలాంటి అద్భుతమే. నిన్ను ముందుగా నా కలలో చూడ్డం నా అదృష్టం'' అని వివరించాడు ప్రభాకరం. ఆమె చాలా ఆసక్తిగా విన్నది. ఆ రాత్రి నవదంపతులు మదనరంగంలో కదను తొక్కి రతి సౌఖ్యాలను తృప్తి తీరా అనభువించారు. ప్రభాకరం కల కల్ల కాలేదు.

*

చిరునామా:
కె.శ్రీనివాస శాస్త్రి,
ఫ్లాట్ నెం.401, శ్రీసాయినికేతన్,
ఆపోజిట్: ఎం.ఎస్.ఆర్. కాలేజీ,
ఎస్‌రాజు నగర్, కూకట్‌పల్లి,
హైదరాబాదు-500 072.
ఫోన్: 66209931.

నమ్మించి మోసం చేసిందామె. దాంతో ఆమెను చంపేశాడతను. చంపేసిన తర్వాత తెలిసింది. ఆమె తనని మోసం చెయ్యలేదని. నిజం తెలుసుకున్న అతను ఆమె చితి దగ్గర కన్నీరు మున్నీరుగా విలపించాడు. బూడిదగా మారిపోయిన ఆమెను దోసిళ్ళతో తీసుకుని గుండెలకు అదుముకున్నాడు. కాటి కాపరి కసిరితే ఆ రాత్రి...ఆ చీకటిలో వెను తిరిగి జన సంద్రంలో కలిసిపోయాడు. అలా కలసిపోయిన అతను ఎక్కడ తేలాడు? ఏ తీరాన నిలిచాడు?

ప్రముఖ రచయిత్రి 'అరణి' సంచలన సృష్టి

సముద్రం మీద సంతకం

సీరియల్ త్వరలో ప్రారంభం